# బేలుబిడిచిన బంధుబు

-డా॥ మంతెన సూర్యనారాయణరాజు

*(ముక్కుపొడుం పీల్చేవారి భాషలోనే ఒక పాత్ర ఈ కథా గమనానికి ఆటపట్టు. గ్రహించండి)*

"**అ**య్యా! సాంబబూర్తిగారూ! బిబ్బల్నే ఉన్నారా లోబల" అంటూ పిలిచాడు అప్పుడే ఊరునుంచి వచ్చిన లంబోదర దీక్షితులు. సాంబమూర్తి భార్య గంగా భవాని దీక్షితుల రాకను గమనించినట్లుంది. వెంటనే భర్తకు తన అశక్తతను తెలపాలని చేస్తున్న పని తొంద రగా తెములుతూ "అయ్యో అన్నయ్యగార్లా ఉన్నారు. ఈయన గారొచ్చాడంటేనా దుంపతెంచాడన్న మాటే! ఇదిగో ఏవండోయ్! మీకోసం ఆ బానకడుపు పెద్దా యన, చెవిటాయన చచ్చాడండీ! రామరామ మాటలు కూడా సరిగ్గా రావడంలేదు, వచ్చారండీ! ఇంకా స్నానం కాలేదా! కూర్చోండి అన్నయ్యగారూ ఆయన వచ్చే స్తారు" అంది చివరి మాటలు గట్టిగా వినిపించేలా అంది.

ఆమె మాటలు కొద్దిగా వినబడినట్లుగా తల ఊపుతూ దీక్షితులు "చెల్లెబ్బా! ఈరోజు బీయింట్లో శాకబాకాలేబిటీ అంట" అంటూ ఆసక్తిగా అడిగాడు. గంగాభవాని చికాకుగా తనలో తాను మాయదారి పొడుం పీల్చి పీల్చి ముక్కు తూరలు మారిపోవడమే కాకుండా ముక్కు మాటలు అర్థం కాకుండా ఉన్నాయి. చచ్చి చెడి ఒకవేళ అర్థం చేసుకున్నా తిరిగి ఏం చెప్పాలన్నా మామూలుగా చెబితే వినపబడనంత పుట్టెడు చెవుడు అని మూలుక్కుంది. సాంబమూర్తి బాత్రూమ్‌లోంచి సరాసరి పూజ చేసుకునే దేవుడి గదిలోకి వెళ్లిపోయాడు. అక్కడి కార్యక్రమం ముగించు కుని సావిట్లోకొచ్చి అప్పటికి భర్తకీ, దీక్షితులకీ కాఫీ రెండు గ్లాసులతో తీసుకొచ్చి ఇచ్చింది. లంబోదర దీక్షితులికి మాత్రం పెద్ద లోటా లాంటి గ్లాసులో పోసి తెచ్చింది.

సాంబమూర్తి, దీక్షితులు ఒకరికెదురుగా ఒకరు కూర్చున్నారు. లంబోదరం కాఫీ కొద్దిగా చప్పరించి పెదవి విరుస్తూ "అబ్బా(మ్మా)యీ! ఇందులో బరికాస్త చెగ్గెర బేస్తే తబ్బ తాగలేను. బీరు (మీరు) రోజూ ఎలాగ్గ దాగుతున్నారో సాంబబూర్తీ!" అన్నాడు. అతని మాటలు అర్థం చేసుకున్న గంగాభవాని పంచదార డబ్బా తెచ్చి అక్కడపెడుతూ "ఇంద నీక్కావలసినంతా వేసుకు తగ లడు" అంటూ లోనికి విసవిసా నడిచి వెళ్లింది.

అలాగేనని దీక్షితులు రెండు గుప్పిళ్లు చక్కెర గ్లాసులో పోసుకుని ఎత్తి తాగబోతుంటే "అదేవిటండీ పూర్తిగా కలవకుండా తాగేస్తారా?!" అంటూ అరుస్తున్నట్లు అడిగాడు సాంబమూర్తి. దీక్షితులు అప్పటికే సగం తాగేశాడు. సాంబంతో "అ...! ఇక్కేమిటి కలుపు కోబడం, కడుపులో గెల్లాగ అబే కలుస్తాయి" అంటూ ఆ మిగిలిందీ ఆగకుండా ఒక్క గుక్కలో గటగటా ఊదిపారేశాడు.

గంగాభవాని పంచదార డబ్బాతో బాటు ఆ ఇద్దరూ తాగిన కాఫీగ్లాసులు తీసుకుని లోనికెళ్లిపోయింది. గట్టిగా దీక్షితులకు వినిపించే సాంబమూర్తి "మీ అబ్బా యికి పెళ్లన్నారు, పిల్ల నచ్చిందా!" అని అడిగాడు. లంబోదర దీక్షితులుకి ఏమర్థమయ్యిందో ఏమో వెంటనే చటుక్కున "నాకు ఈ బొ(వ)యిసులో పెళ్లేబిటీ! బీ(మీ)రు బరీనండీ!" అంటూ కిసుక్కున నవ్వాడు.

## ప్రవాసి

**నే**నొక ప్రవాసాంధ్రుడ్ని
తాత ముత్తాతలు ఆంధ్రులు
గాని నా కన్నవారు పొరుగు రాష్ట్రంలో
కాపురం సాగించి కడుపులోనే నన్ను
ప్రవాసుడ్ని చేశారు.
పుట్టి బుద్దెరిగేకే తెలిసింది
నేనొక ఆంధ్రుడ్నేగాని ప్రవాసాంధ్రుడ్ని అని.

నా రాష్ట్రం, నా సోదరులని దూరపు కొండల్ని
చూసి పగటి కలలు కన్నాను.
ఎప్పటికైనా నన్ను జన్మనీయని జన్మభూమి
ఆంధ్ర మాత ఒడి చేరాలని పరుగులు తీశా
చివరకు చేరుకొన్నా ఇక్కడొక అనామకుడిగా
ప్రవాసాంధ్రుడిగా.
ఉత్కళలో ఉదయించా
ఆంధ్రాలో ప్రవాసాంధ్రుడిగానైనా
అస్తమించాలని...

-గరిమెళ్ళ సత్యనారాయణ

ఆయనగారు నవ్వుతూంటే పొట్ట ఊగిపోతూ ఉంది. "ఏవండోయ్ శ్రీవారూ! మీ లంబోదర దీక్షితులుగారు ఈ పూట భోజనానికి ఇక్కడ దిగబడతారా" అంటూ లోపల్నుంచే అడిగింది. సాంబమూర్తి భార్యతో "ఎందుకలా అడుగుతున్నావు?" అన్నాడు.

## మలయ సమీరం

వనంలో వందలాది సుమాల నడుమ
ముళ్ళతో మాట్లాడుతామా?
కళ్లెదుట సీతాకోక లెగురుతుంటే
గొంగళి పురుగుల్ని గుర్తు చేసుకొంటామా?
తామరపువ్వును తాకిన తమకంలో
తగిలిన పంకిలాన్ని పట్టించుకుంటామా?
అణువణువు అందాన్ని
కళ్ళలోనికి నింపుకుంటూ
ఆనందాన్ని
మనసు పొరల్లోకి ఒంపుకుంటూ
బతుకుని భరోసాగా గడిపేయొచ్చు!
తలపుల తుళ్ళింతలతో తుదిదాకా
ఆశలు రాలిపడే శిశిరం
ఇక లేదని
కొత్త చివురులు తొడిగే
వసంతమే తప్ప
నిస్సత్తువుగా సాగే
నిశీధి ప్రవాహమా జీవితమంటే..?
హృదిని మృదువుగా తాకే
మలయ సమీరం
ఇల కోయిల కంఠంలో
కదన కుతూహల రాగం
పదిలంగా పరుచుకున్న
పరవశపు ఆనవాళ్ళు
నిరాశా నిస్పృహల ఊబుల్లో
దిగబడక ముందే
మార్మిక మౌనం వీడుదాం
మారమని అడుగుదాం-
'ప్రకృతిని'
ఎందుకంటే-
ఎటూ మనం మారం కదా!

-యస్. యస్. శ్రీనివాస్

"అబ్బే మరో శేరు బియ్యం కడిగి పెద్దపాత్రలో వంట చేద్దామని. అలాగే కూర..."

"ఉండేలాగే కనిపిస్తున్నాడే! ఏదో పెద్దపని పెట్టుకునే వచ్చుంటాడు. ఇంతకీ తమరొచ్చిన పనేవిటిట?" అంటూ చివరి ప్రశ్న అతనికి వినబడేలా సంధించాడు.

"బనా! బేరే ఏబుంటుందీ బిల్లాడికి బెండ్లి... నిజ్జ(శ్చ)యమైంది గదా! బందుకని గాస్త డబ్బు జర్దుబాటు జేస్తారని బొచ్చాను. గట్నం గబ్బు నాజేతికి అందగానే ఇజ్జేద్దానులెండి. అదీ బిషయం" అన్నాడు సాంబంతో దీక్షితులు. భార్య గంగభవానికి మాత్రమే వినబడేలా సాంబమూర్తి జాగ్రత్తగా "గంగా! ఏమేవ్! డబ్బు లేదని అబద్ధమాడేస్తాగాని, కనీసం భోజనమన్నా పెట్టి పంపించకపోతే బంధువులేమనుకోరూ! ఎంత బీరకాయ పీచైతే మాత్రం" అన్నాడు.

దూకుడుగా భర్త సాంబమూర్తి దగ్గరకొస్తూ గంగాభవాని "ఆ! ఆ! ఉంటుందుంటుంది. మా బాగా ఉంటుంది. గ్యాస్ అయిపోయి ఆ కుంపటి తడి బొగ్గులతో పొగతో కళ్ల పోట్లు, నడుం నొప్పీను. మీకేం తెలుస్తుంది ఇక్కడుండి పప్పుపిడతలా కూర్చుని ఎన్ని కబుర్లన్నా చెబుతారు. నేను పడుతున్న పాట్లు మీకేం తెలుస్తాయి గనుక" అంటూ విసుక్కుంది. సాంబమూర్తి బాగా ఆలోచించి భార్యతో "అయితే ఐదు వందల రూపాయలుంటే చూడు, పంపించేద్దాం ఈ ఘటాన్ని. లేకపోతే వదిలిపెట్టడు" అన్నాడు. ఆశ్చర్యంతో రెండ బుగ్గలూ నొక్కుకుంటూ గంగాభవాని "అమ్మో! ఐదొందలే! ఈ జన్మలో ఈయనగారు తీర్చగలడా ఆ చేబదులు. గతంలో రెండొందలు పట్టుకెళ్లాడు దమ్మిడీ తిరిగిచ్చిన పాపాన పోలేదు. మీరు గ్యాస్ కోసమొచ్చిన ఆ మూడొందల పైచిలుకు తప్పితే నా దగ్గరేం లేదు" అంది. అటూ యిటూ కాలుగాలిన పిల్లిలా సాంబం తచ్చాడి "అందుకే నా మాట విని నాలుగు రకాల కూరలతో భోజనం పెట్టేసేయ్" అన్నాడు.

❖ ❖ ❖

భోజనాలయ్యేటప్పటికి మధ్యాహ్నం మూడు గంటలయ్యింది. భర్త మాటకు ఎదురు చెప్పకుండా చెప్పినట్లు చేసింది దీక్షితుల్ని వదిలించుకోవాలని గంగాభవాని. పాపం పనిచేసి చేసి ఉందేమో ఆమెకు అలసటకి తోడు శోష వచ్చి ముఖం తిరిగి పడిపోయింది నట్టింట్లో. ఏదో పద్ద అలికిడి విని సాంబమూర్తి లోనికొచ్చి గంగ ముఖం మీద చల్లని

నీళ్లు చల్లాడు. మెల్లగా మూలుగుతూ కళ్లు తెరిచింది. అయోమయంగా కళ్లముందున్న భర్తతో నీరసంగా "అమ్మో! ఏవండీ ఆయన ఉన్నాడా! వెళ్లాడా!" అని అడిగింది. ఆమె కళ్లు అటు యిటూ తిరిగి చూడ్డానికి కూడా ఓపిక లేనట్లు అగుపించాయి. సాంబమూర్తి నిజం చెప్పలేక "ఉన్నాడు. మళ్లీ..." అంటూ ఏదో చెప్పబోయి సంశయంలో పడ్డాడు. చెబితే మళ్లీ ఫెయింటై భార్య ఎక్కడ పడిపోతుందోననే భయంతో. గంగాభవాని "పొద్దుట్నుంచీ కార్తీక ఏకాదశి సోమవారం అని పచ్చి మంచినీళ్లన్నా ముట్టుకోలేదు నేను. మీరు మళ్లీ... గిల్లీ అంటూ నానుస్తూ టీ పెట్టమంటే నా వల్ల కాదు. మీకుగాని, ఆయనగారికి గాని నేనింక ఏమీ అమర్చి పెట్టలేను. అంతా మొహమాటం అనుకుంటే లంబోదరంగార్ని ఏ హోటల్‌కో లాక్కెళ్లండి. లేదా ఉన్నపళంగా తక్షణం తరిమేయండి. ఆనక సాయంకాలం చంద్రుణ్ణి, నక్షత్రాల్ని చూసి ఎంగిలిపడదామనుకున్నా! కనీసం వండే ఓపిక కూడా నాకిప్పుడు లేదు. కనీసం ఒక్క మెతుకన్నా మిగిలిందా అంటే ఏమీ మిగల్చకుండా మెక్కేశారు" అంటూ ఆయాసంగా మంచినీళ్లని వేలితో భర్తకు సైగచేసింది గంగ.

నీరసంతో కళ్లు మూసుకుని మళ్లీ తెరిచింది. సాంబమూర్తి భార్యతో నెమ్మదిగా "అట్టే గట్టిగా మాట్లాడకే! అనుమానం వస్తుంది. పెట్టి దెప్పినట్టు ఆయన అనుకోడూ! నీకో విషయం తెలుసా! ఈయనగారికి వంటిపెట్టలేక భార్య ఈయన్ని వదిలి ఆరేళ్లయ్యింది. మిగిలింది ఈ పెళ్లిగాని కొడుకు. బాబూ కొడుకు లిద్దరూ వండుకోవడం బద్ధకమని హోటల్ నుంచి భోజనం తెచ్చుకుని తింటున్నారు. అందుకే ఈయన ఈ మధ్య అరాయించి చిక్కి సగమైపోయాడు. ఇప్పుడేం చూశావు. వయస్సులో వుండగా శేరు కందిపప్పు, బకెట్ సాంబారు, బొడ్డు గిన్నెడు కూర, తప్పేలుడు పెరుగు, చిన్న గిన్నె నెయ్యి సునాయాసంగా లాగించేవాడు. భార్య ఎక్కడో పచ్చళ్లమ్ముకుని బ్రతుకుతోందని చెప్పారు" అంటూ ఆగాడు. "ఏవండీ ఆ దీక్షితులది పొట్టా లేక పోలేరమ్మ చెరువా! వండిన అన్నంలో మూడింతలు చులాగ్గా మెక్కేశాడు. పైగా వీరభద్ర పళ్లెంలాంటి దాన్లో నాలుగు కూరలు, ఆవకాయ అన్నీ మొదటి పడుగులో లాగించేశాడు. పరవాన్నం మీరు తినరని ఆయన దగ్గర గోకర్ణం పెడితే, గోకర్ణం చుక్క లేకుండా ఊదేశాడు. పళ్లెం నిండా గారెలు పెడితే నాలుగేసి నోట్లో పెట్టుకుని నమలకుండానే ఒక్క గుటకేసి, మొత్తం కానిచ్చేశాడు. అమ్మో తిండికి తిమ్మరాజుని మరిపించాడు."

తాను వెళ్లి లంబోదర దీక్షితుల్ని వెళ్లిరమ్మని చెప్పాలనుకున్నాడు సాంబమూర్తి. కాని ఎందుకనో చెప్పలేకపోయాడు. భార్య దగ్గరకు తిరిగొచ్చి "గంగా నేన్చెప్పలేకపోతున్నానే! ఏదోవిధంగా ఆయనతో నువ్వే వెళ్లి వెళ్లిరండని చెప్పు" అన్నాడు. గంగాభవాని లేచి ముఖానికి పట్టిన చెమట చీరకొంగుతో తుడుచు కుంటూ "మీ మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు"

## బతుకు

బతుకు అందరిదీ ఒకటే
బతకడంలోనే తేడాలు
బతుకు ఏం అడుగుతుంది
బతుక్కి పరమార్థం ఏమిటో చెప్పమంటుంది
బతుకు బలి అవుతుంది బలి తీసుకుంటుంది
బతుకు భాగస్వామి అవుతుంది బంగాళాఖాతం అవుతుంది
బతుకు భయమౌతుంది బరువౌతుంది
బతుకు రాగమౌతుంది రోగమౌతుంది
బతుకు భోగమౌతుంది భాగమౌతుంది
బతుకు గేయమౌతుంది గాయమౌతుంది
బతుకు బాధ్యతౌతుంది బాధ ఔతుంది
బతుకు బడబాగ్నవుతుంది బండరాయవుతుంది
బాల్యంలో బతుకు బంగారమవుతుంది
యవ్వనంలో శృంగారమవుతుంది
వృద్ధాప్యంలో బతుకు శాపమవుతుంది
బతుకు గురించి సరైన భాష్యం చెప్పేదెవరు
బతుకు బరిలో బరితెగించి బతికిందెవరు
అతుకుల బతుకని అనుకోనిదెవరు
భావోద్వేగాలు లేని బతుకు బతుకవుతుందా?
ఇప్పుడు మనిషి బతికుండటం అంటే మనసు చచ్చిపోవడమే
బతికి చెడినోళ్లు కొందరు
చచ్చి బతికినోళ్ళు కొందరు
బతికి రోజూ చస్తున్నవాళ్ళే అందరూ.

-జి. విజయలక్ష్మి

అంటూ లేచి వెళ్లింది. "అన్నయ్యగారూ! ఇక బయల్దే రండి. మీ ఊరెళ్లేటప్పటికి పొద్దుపోతుంది" అంది.

"ఏబిటీ సాయంగాలందాకా ఉండబంటాబా! అలాగే దానిదేబుందీ" అన్నాడు లంబోదరం. గంగ భవాని కంగారుపడిపోతూ "హతోస్మి! సాయంకాలం దాకా ఇక్కడుంటే నా యిల్లు గుల్లే! అది కాదు తమరిక ఇంటికి దయచేయండి" అంది.

లంబోదర దీక్షితులికి గంగాభవాని మాటలు వినిపించినట్లు లేవు. ఖర్మ ఛర్మ అంటూ చేత్తో నెత్తి కొట్టుకుంది.

"ఏబిటో నాకు ఏ బిషయం సక్కురమంగా బినిపించి చావదు" అన్నాడు గట్టిగా ఆవులిస్తూ. మళ్లీ ఆవులింత పోవాలని చిటికలేస్తూ కళ్లు నులుము కున్నాడు. ప్రక్కనున్న భర్తను చేత్తో పొడుస్తూ "అయ్యా! శ్రీవారూ! మీకు పుణ్యముంటుంది. మీకూ మిత్రుడో, చుట్టమో ఎవరైతేలెద్దురూ ఆయనకూ పదివేల నమస్కారాలు. ముందిక్కణ్ణుంచి దీక్షితుల్ని నయానో భయానో సాగనంపి రండి. నాకు కళ్లు తిరుగు తున్నాయి" అంది లోనికి వెళ్లి మంచంమీద మేను వాల్చింది.

భార్య దగ్గరకెళ్లి "గంగా! ఆ గ్యాస్ తాలూకు డబ్బులెక్కడున్నాయ్. అందులో రెండొందలిచ్చి పంపేద్దాం! లేదా ఈ పూటకి కదలడు" అన్నాడు సాంబమూర్తి.

తలదిండు క్రింద వున్న గ్యాస్ బండకు గాను దాచిన మూడొందల పైచిలుకులో రెండు పచ్చనోట్లు సాంబమూర్తికి ఇచ్చింది. వాటిని లంబోదర దీక్షితుల చేతిలో పెడుతూ సాంబం ఇంటిమీద పెంకులెగిరి పోయేటంత గట్టిగా "ప్రస్తుతానికి నా దగ్గర ఇంతకన్నా సొమ్ములేదు. మీ కొడుకు కట్నం సొమ్ము వచ్చాకా ఇచ్చినా సరే! లేక మీ కోడలు నీళ్లు పోసుకుని బిడ్డనెత్తుకొచ్చాక యిచ్చినా సరే!"

"రాబ! రాబ! ఎంతబాట. ఎంతబాట. అలా రాగానే ఇలాగిచ్చేసిబోనూ... భలే బారే!" అన్నాడు కూర్చున్న కుర్చీలోంచి లేచి, అంగవస్త్రం భుజం మీద వేసుకుంటూ. రెండడుగులు వాకిలివైపు వేశాడు లంబోదర దీక్షితులు.

"అబ్బా(మ్మా)యితో చెబ్బడం బరిచేబోయాను. అబ్బాయిూ నేను బెడుతున్నా" గంగాభవాని కోసం చూస్తూ అన్నాడు.

"నే చెబుతాలెండి మీ చెల్లాయికి. మీకెందుకంత శ్రమ. వెళ్లిరండి" అన్నాడు.

"బంచిది. బంచి భోజనం బెట్టారు. బల్లా(మళ్లా) బెళ్లి అయ్యాక తిరిగి బస్తాలెండి. అన్నట్టు బెళ్లికి బీరు చెల్లాయి తబ్బకుండా రాబాలిసుబా!" అన్నాడు. సాంబమూర్తి అలాగేనన్నట్లు తలాడిస్తూ ఆ మురుగు చుట్టాన్ని గడప దాటించి వచ్చాడు.

లోపలికి తలుపేసి వస్తూ "గంగాభవానీ ఆయనెళ్లి పోయాడు" అంటూ తానూ నీరసంగా కుర్చీలో చతికిల బడ్డాడు. గంగ గుండెల మీద భారం దిగినట్టు "బ్రతికిం చాడు బకాసురుడు. ఇంకా ఇంట్లో గనుక వుండి వుంటే నా ప్రాణాలు తోడేసేవాడే!" అంటూ మెటికలు విరగదీసింది. "అదేమిటే ఆయన ఎంతైనా నీకూ నాకూ 'బేలు బిడిచిన బందుబు' అంటూ లంబోదరాన్ని మిమిక్రీ చేశాడు. దీక్షితుల్ని భర్త అనుకరణ చేస్తూ మాట్లాడినందుకు ఆనంద తరంగమై పడి పడి నవ్వింది.

*(అంకితం: ముక్కుపొడుం పీల్చే ప్రబుద్ధులకు చిరుకానుకగా)*

■

## 'మని'షా

నిసిరాత్రి కాదు
నిషాలో వున్న మనిషి కాదు
పసిమొగ్గ మనీషాను
నిష్కారణంగా
బలిగొన్నది మృగమా?!
కాదు! కాదు!
మనిషిలో దాగున్న "మనీ" పైత్యమా?
లేదా "మైకమా"?
మనిషిలో చేరిన మృగమా?!
కుత్సిత కుతంత్రాల
కుళ్లు లోకంలో
మనలేక
కూపంలో దాగున్నావా?!
మనీషా!?
శేషజీవితాన్ని
నుసిలా రాల్చిన
"వైషమ్యమా!?"
నాడు ఏది (లేదా) శిక్ష

-శ్రీగోనె